ChimataMusic.com
Patha Patala Parnasala

# శోభన్‌బాబు, చక్రవర్తిల మేలు కలయికలో కొన్ని ఆణిముత్యాలు

- శ్రీనివాసరావు చిమట (01/14/08)

నిన్నటి తరం అందాల నటుడు, నటభూషణ శోభన్‌బాబు అంటే చిన్నప్పటి నుండి నాకు ప్రత్యేకమైన అభిమానం. అభిమానిగా ఆయన జన్మదినం, జనవరి 14 నాడు ఆయన సినిమాలకు సంబంధించిన, నాకు తెల్సిన విషయాలను అందరితో పంచుకోవాలనిపించింది. ఈ ఆలోచనకు అక్షర రూపమే ఈ వ్యాసం. కానీ ఆయన సినిమాలలో నాకు నచ్చే అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిల్లో ఏ అంశం గురించి ప్రస్తావించాలా అని ఆలోచిస్తే శోభన్‌బాబుకి అత్యధిక హిట్స్ ఇచ్చిన చక్రవర్తి సంగీత నిర్దేశకత్వంలో వచ్చిన చిత్రాలలోని నాకిష్టమైన ఒక 30 పాటల గురించి విశ్లేషించాలనిపించింది.

చక్రవర్తి పేరు వినగానే 'యమగోల' సినిమాతో ఆరంభమైన అతని మాస్ పాటలే గుర్తుకు వస్తాయి. కాని ఆ సినిమాకు ముందుగా ఒక ఆరేళ్ళ పాటుగా శోభన్‌బాబు సినిమాలకు అద్భుతమైన మెలోడీలు ఇచ్చిన సంగీత దర్శకుడాయన. వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తొలిచిత్రం 'భలే గూఢచారి' అయినప్పటికీ, 'మూగ ప్రేమ' అనే చిత్రం తో మొట్టమొదటిసారిగా చక్రవర్తి అనే కొత్త సంగీత దర్శకుని పేరు వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా ఈ సినిమాలోని "ఈ సంజెలో.. కెంజాయలో" అనే పాటను చక్రవర్తి అద్భుతంగా స్వరపరిచాడు. గానకోకిల సుమధుర స్వరానికి వర్ధమాన గాయకుడైన బాలు ఆలాపన తోడైన ఈ పాట చక్రవర్తి తొలిపాట గా ప్రాచుర్యం పొందింది. కానీ ఈ సినిమా అంతగా ప్రజాదరణ నోచుకోక పోవడం వలన చక్రవర్తికి రావాల్సిన గుర్తింపు రాలేదు.

కె. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన సినిమాలన్నిటిలోని అత్యధిక చిత్రాలలో నటించిన స్టార్ గా శోభన్ బాబుకి పేరుంది. క్రాంతికుమార్ నిర్మాతగా చేసిన తొలిప్రయత్నంగా విశ్వనాథ్‌తో 'శారద' సినిమా మొదలైంది. అప్పటివరకు కె.వి.మహాదేవన్, యెస్.రాజేశ్వరరావు లాంటి ఉద్దండులతో పనిచేసిన విశ్వనాథ్ తొలిసారిగా చక్రవర్తికి అవకాశం ఇచ్చాడు. ఇందులో టైటిల్ సాంగ్, "శారదా.. నను చేరగా", మరియు "రేపల్లె వేచెను.. వేణువు వేచెను" నేను చాలా ఇష్టపడే పాటలు. ఈ సినిమా అనూహ్య విజయం సాధించడంతో, చక్రవర్తి సంగీత దర్శకుడిగా ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు.

తరువాత వచ్చిన 'ఇదా లోకం' సినిమాతో చక్రవర్తికి ప్రతిష్ఠ మరింతగా ఇనుమడించింది. గాయకుడు రామకృష్ణ శోభన్‌బాబుకు పాడగా, బాలు సెకండ్ హీరో అయిన చంద్ర మోహన్‌కు పాడాడు. శోభన్ బాబు, శారదల మీద సాగే "నీ మనసు, నా మనసు ఏకమై" పాటలో రామకృష్ణ చాలా బాగా పాడాడనిపిస్తుంది.

బహుశా 1973, 1974, 1975 సంవత్సరాలలోని వరుస విజయాలు శోభన్ బాబు సినీజీవితంలో మధుర ఘట్టాలుగా చెప్పవచ్చు. 1973 లో రెండు మ్యూజికల్ సూపర్ హిట్స్ ('శారద', 'ఇదా లోకం') తర్వాత 1974 లో వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో ఒక్క సినిమా కూడా రాకపోవడం కొద్దిగా విచిత్రంగా అనిపిస్తుంది.



తరువాత వచ్చిన చిత్రం కె.రాఘవేంద్రరావు తొలి ప్రయత్నమైన 'బాబు'. శోభన్ బాబు, లక్ష్మిలపై దర్శకేంద్రుడు చిత్రీకరించిన "ఎన్నెన్ని వొంపులు.. ఎన్నెన్ని సొంపులు" పాటను ఈ సినిమాకి హైలెట్ గా చెప్పొచ్చు. ముఖ్యంగా ఈ పాటలో పల్లవికి ముందు సాకీగా వచ్చే మాటల్లో సుశీల, బాలు గొంతుల్లో చిలిపితనం ఒలికిన తీరు బాగుంటుంది.

'బలిపీఠం' లోని భార్యాభర్తల మధ్య విరహ శృంగారగీతంగా దాసరి చేత అద్భుతంగా చిత్రీకరించబడిన పాట "కుశలమా.. నీకు కుశలమేనా". ఈ పాట వింటుంటే మెలోడీ విషయంలో మామ మహాదేవన్‌కు, సత్యంకు ఏ మాత్రం తీసిపోకుండా చక్రవర్తి స్వరరచన చేశాడనిపిస్తుంది.

ఇక 'జేబుదొంగ' గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఫామిలీ చిత్రాలే కాదు, మాస్ చిత్రాలను కూడా అలవోకగా శోభన్‌బాబు చేస్తాడని చాటిచెప్పిన చిత్రం. రొమాంటిక్ పెయిర్‌గా పాపులర్ అయిన శోభన్-మంజుల మీద వచ్చిన మరో శృంగార ఆణిముత్యమే ఈ "నీలాల నింగిలో.. మేఘాల తేరులో" పాట. హీరో, హీరోయిన్‌లు పరస్పరం టీజింగ్ చేసుకునే నేపథ్యంలో వచ్చే మరో పాట "గోవిందో.. గోవిందా" బహుశా చక్రవర్తి మొదటిసారిగా చేసిన పక్కా మాస్ డ్యూయెట్ పాట కావొచ్చు.

హిందీ సినిమా 'దో యార్' ఆధారంగా శోభన్‌బాబు, కృష్ణంరాజు హీరోలుగా వచ్చిన సినిమా 'ఇద్దరూ ఇద్దరే'. ఇందులో శోభన్‌బాబు, మంజుల మీద వచ్చే "వళ్ళంత వయ్యారమే.. కుర్రదానా" పాట బాగా పాపులర్ అయింది.

శోభన్‌బాబుతో దర్శకేంద్రుడి మలి ప్రయత్నమే 'రాజా'. ఇది అమితాబ్ 'మజ్‌బూర్' ఆధారంగా

తెలుగులో తీయబడిన చిత్రం. శోభన్‌బాబు, జయసుధ మీద చిత్రీకరించబడ్డ "గుండె లోనా ఒక మాటుంది", "మాట చూస్తే మామిడల్లం" పాటలు రెండూ వినడానికి బావుండే పాటలు.

మాదిరెడ్డి సులోచన గారి Mr. సంపత్, M.A నవల ఆధారం తీయబడిన 'ఈ తరం మనిషి' లో శోభన్‌బాబు, జయప్రదలపై వచ్చే "ఇచ్చేశా నా హృదయం.. తీసుకో" ఒక అందమైన మెలోడీ.

ఇంకో హిందీ సినిమా, 'కాళీ చరణ్' ఆధారంగా వచ్చిన 'ఖైదీ కాళిదాసు' లో శోభన్‌బాబు, దీప మీద ఒక టీజింగ్ నేపధ్యంలో సాగే "ఎవరీ చక్కని వాడు.. ఎంతకీ చిక్కని వాడు" పాట వినడానికి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. చక్రవర్తి రీమేక్ చిత్రాలు చేసినప్పటికీ పాటల ట్యూన్స్ కాపీ చేయడాన్ని సాధ్యమైనంత వరకు avoid చేసేవాడు. అందుకనే ఇలాంటి పాటలు టిపికల్ చక్రవర్తి బాణీలోనే సాగుతాయి.

1975 లో 'సోగ్గాడు', 'జీవన జ్యోతి', 'జేబుదొంగ', 'బలిపీఠం' లాంటి సూపర్ డూపర్ హిట్స్ తరువాత వచ్చిన శోభన్‌బాబు సినిమాల మీద ప్రేక్షకుల అంచనాలు అమాంతంగా పెరిగాయి. మూడు, నాలుగు సినిమాలు తప్పించి దాదాపు రెండున్నర సంవత్సరాలపాటుగా అన్నీ సినిమాలు వరుస వైఫల్యాలను చవి చూశాయి. ఈ వైఫల్యాల నేపధ్యంలో వచ్చిన సినిమానే 'మల్లెపూవు'. శోభన్‌బాబుకి 'మనుషులు మారాలి' సినిమాకి ముందు కూడా ఇలాంటి పరిస్థితే వచ్చింది. మధుసూదనరావు గారు మొదటి నుండి శోభన్‌బాబుకి God Father గా వ్యవహరిస్తూ 'వీరాభిమన్యు', 'మనుషులు మారాలి', 'జేబుదొంగ' లాంటి సెన్సేషనల్ హిట్స్ ఇచ్చారు. మరల ఆయన రంగంలోకి దిగి 'ప్యాసా' సినిమాను అత్యద్భుతంగా తెలుగులో 'మల్లెపూవు' గా మలిచాడు. వాస్తవానికి ఈ సినిమా మీద ఒక వ్యాసం రాద్దామనిపించింది. సినిమా ఆద్యంతమూ ఒక దృశ్యకావ్యంలా సాగుతుంది. జీవితంలో ఓడిపోయిన ఒక భగ్న ప్రేమికుడిగా, ప్రజాదారణకు నోచుకోని ఒక కవిగా ఆయన వేణు పాత్రకు ప్రాణాన్ని పోసిన తీరు నిజంగా నభూతో నభవిష్యతి. కేవలం NTR, ANR లాంటి మహానటులు చేయగలిగిన సాత్విక నటన అది! లక్ష్మి కూడా పోటీ పడి నటించిన తీరు నిజంగా అభినందనీయం. సహజంగా బాలు వాయిస్ హీరో కృష్ణకి సరిపోయినట్టుగా ఇంకెవరికీ సరిపోదనే ఒక వాదన ఉంది. కాని ఒకసారి స్వయంగా బాలు తన ఇంటర్వ్యూలో తన వాయిస్ తెలుగులో శోభన్‌బాబుకి, కృష్ణకు చక్కగా నప్పుతుందని వెల్లడించాడు. ముఖ్యంగా 'మల్లెపూవు' సినిమా పాటల విషయంలో శోభన్‌బాబు అభినయానికి, బాలు గాత్రానికి ఎంత బాగా కుదిరిందంటే, ఆ పాటలు వింటున్న ప్రతీసారి శోభన్‌బాబు విషణ్ణ వదనమే మనకు గుర్తొస్తుంది. ఈ సినిమాలో శోభన్‌బాబు మాటల్లోని ఆర్తిని, ఆర్ద్రతని బాలు పాటల్లో అదే స్థాయిలో ఈ రెండు భావాలని

ఒలికించాడంటే అతిశయోక్తి కాదు.

ఇక 'మల్లెపూవు' లోని పాటల విషయానికి వస్తే.. చక్రవర్తి చేసిన స్వరరచన గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది! ఈ సినిమలోని తొమ్మిది పాటలు కూడా ఆణిముత్యాలే! ఒక కామెడీ పాటను, క్లైమాక్స్ పాటను తప్పించి మిగతా వాటి గురించి ఇక్కడ ప్రస్తావిస్తాను. "మల్లెపువ్వులా వసంతం.. మా తోటకొచ్చింది" అనే చిన్న పాటతో సినిమా మొదలౌతుంది. ఇందులో హుషారు కలిగించే రెండు డ్యూయెట్స్ ఉన్నాయి - "చక చకలాడే చక్కని చిలకమ్మ " మరియు "ఓహో లలితా.. నా ప్రేమ కవిత". ముఖ్యంగా "ఓహో లలితా" అనే పాట చాలా భావోద్వేగంతో సాగుతూ శ్రోతలను కూడా ఆ పాట



వింటున్నంతసేపు ఆ ఉద్వేగానికి గురి చేస్తుంది. లక్ష్మి అభినయ కౌశల్యానికి ఒక మచ్చుతునక ఈ రెండు పాటలు - "చిన్నమాట.. ఒక చిన్నమాట" మరియు "నువ్వు వస్తావని బృందావని". ఇక మిగిలిన మూడు పాటలు హృదయవేదనను తెలియచేసే పాటలు. ఈ మూడు పాటలు వింటున్న ప్రతీసారి నా మనసు బరువెక్కుతుంటుంది. ముఖ్యంగా వేశ్యల దయనీయస్థితి ని వర్ణిస్తూ సాగే పాట "ఎవ్వరో ఎవ్వరో.. ఈ నేరాలను అడిగేవారెవ్వరో". ఈ పాట రాసినప్పుడు, తరువాత విన్నప్పుడు కూడా వేటూరి ఏడ్చారని ఆయనే స్వయంగా చెబుతుంటారు!

"ఓ ప్రియా.. మరుమల్లియ కన్నా తెల్లనిది" మరియు "ఎవరికి తెలుసు.. చితికిన మనసు" పాటలకు ముందు కవితా రూపంలో వచ్చే సాకీలు చాలా బాగుంటాయి. 'మల్లెపూవు' లోని పాటలు విన్న తర్వాత మామ కె.వి.మహాదేవన్ కూడా ఇంత కన్నా గొప్పగా చెయ్యలేడేమో అనిపించింది. నిజానికి 'ప్యాసా' ని తెలుగులోకి 'మల్లెపూవు' గా అనువదిస్తున్నారని, దానికి చక్రవర్తి సంగీత దర్శకత్వం వహించబోతున్నాడని తెలిసినప్పుడు సినీ విశ్లేషకులు 'అన్నీ మాస్ పాటలే చేసే చక్రవర్తి ఈ సినిమాకు ఏ మాత్రం న్యాయం చేయగలడో' అని సందేహించారు. కానీ 'మల్లెపూవు' లోని పాటలను విన్న తర్వాత సందేహాలన్నీ పటాపంచలై వారే చక్రవర్తి ప్రజ్ఞకు అభినందనలను తెలియచేశారు..

చక్రవర్తి ఎన్నో పాటలను సెట్ పైనే అప్పటికప్పుడు స్వరపరిచేవాడని ప్రతీతి. అలాంటిది 'మల్లెపూవు' లోని "ఓ ప్రియా.. మరు మల్లియ కన్నా తెల్లనిది" పాటకు సరైన ట్యూన్ కోసం ఒక రాత్రంతా నిర్విరామంగా ప్రయత్నించాడు!

శతృఘ్న సిన్హా, రాజ్ కపూర్ లు ప్రధాన పాత్రధారులుగా వచ్చిన 'ఖాన్ దోస్త్' ను తెలుగులో దర్శకేంద్రుడు శోభన్‌బాబు, సత్యనారాయణలతో 'మోసగాడు' గా తీశాడు. చిరు ఇందులో విలన్ గా

నటించడం ఒక విశేషం. ఒకానొక సందర్భంలో చిరు గురించి చెబుతూ "ఇకపై తెలుగు సినిమా ఇండస్ట్రీ ఇలాంటి డైనమిక్ యువకుల చేతుల్లోకి వెళ్తుంది" అని శోభన్‌బాబు ఉటంకించడం ఆయన దూరదృష్టికి, ఉదాత్తమైన వ్యక్తిత్వానికి నిదర్శనం. ఈ సినిమాలో "ఏ వసంతమిది.. ఎవరి సొంతమిది" అనే పాట శోభన్‌బాబు, శ్రీదేవి మీద చిత్రీకరించబడి మంచి మెలోడీగా నిలిచిపోయింది.

తరువాత మధుసూదనరావు గారి దర్శకత్వంలో వచ్చిన 'జీవితరథం' లో శోభన్‌బాబు, సుమలతల మీద వచ్చే "చిగురాకులలో.. ఒక చిలకమ్మ" పాటను సుశీల, చక్రవర్తి కాంబినేషన్ లో ఒక చక్కని సోలో పాటగా చెప్పొచ్చు.



మరల దర్శకేంద్రుడు, శోభన్‌బాబు కాంబినేషన్ లో వచ్చిన మరో ఆణిముత్యం 'దేవత'. "ఎల్లువొచ్చి గోదారమ్మ" పాటతో చక్రవర్తి తను NTR మాస్ పాటలనే కాదు, ఇలాంటి మెలోడీలను కూడా సవ్యసాచిలా ఒకే పీరియడ్ లో చెయ్యగలడని నిరూపించాడు.

కోదండరామిరెడ్డి మొదటిసారిగా శోభన్‌బాబుతో తీసిన చిత్రం 'ప్రేమ మూర్తులు'. శోభన్‌బాబు, రాధ మీద "ఊరుకో ఏడవకు ఊరుకో" అనే విషాద గీతం అద్భుతంగా తీయబడింది.

తరువాత 'ఇల్లాలి కోరికలు' సినిమాలో శోభన్‌బాబు, జయసుధల మీద చిత్రీకరించిన పాట "టిక్, టిక్, టిక్.. గడియారం పన్నెండయ్యింది". ఆలుమగల మధ్య చిలిపి శృంగార గీతంగా ఈ పాట బాగా పాపులర్ అయింది.

శోభన్‌బాబు, సరిత, రాధిక ప్రధాన పాత్రధారులుగా వల్లభనేని జనార్ధన్ (విజయబాపినీడుకి అల్లుడు మరియు 'గ్యాంగ్ లీడర్' సినిమాలో SP పాత్రధారి) దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'తోడు-నీడ'. ఇందులో శోభన్‌బాబు, సరిత పై వచ్చే "నా తోడువై.. నా నీడవై" పాటను భార్యా భర్తల మధ్య అనురాగ దాంపత్యానికి చక్కని ఉదాహరణగా నిలిచే ఒక అద్భుతమైన పాటగా చక్రవర్తి మలిచాడు.

'ముందడుగు' లో వేటూరి రాసిన సంస్కృతపదభూయిష్టమైన "వేయి పడగల మీద.. కోటి మణుగుల నేల" అనే భక్తిరస ప్రధానమైన పాటకు చక్రవర్తి, బాలు పరిపూర్ణ న్యాయం చేకూర్చారు.

'బలిపీఠం' తరువాత ఆ పాటల స్థాయిలో దాసరి, శోభన్‌బాబు, చక్రవర్తి కాంబినేషన్ లో వచ్చిన పాట

'జగన్' లోని శోభన్‌బాబు, జయసుధ లపై చిత్రీకరించబడ్డ "అది ఒక రాతిరి.. వెన్నెల రాతిరి". రాజ్ సీతారామన్ తెలుగులో పాడిన మొట్టమొదటి పాట ఇది.

కోదండరామిరెడ్డి శోభన్‌బాబుతో తీసిన మరో చిత్రం 'శ్రావణ సంధ్య'. ఇందులో శోభన్ బాబు, విజయశాంతిలపై సాగే "ప్రియతమ లలనా" పాట సాహిత్యపరంగా లలితంగా అనిపిస్తూ, సంగీత పరంగా చక్రవర్తి మార్కు బీటుతో ఉత్సాహంగా సాగుతుంది.

రాజాచంద్ర దర్శకత్వంలో మనోజ్ కుమార్ 'రోటీ కపడా అవుర్ మకాన్' చిత్రం శోభన్ బాబు ప్రధాన పాత్రధారిగా 'జీవన పోరాటం' గా వచ్చింది. హిందీ పాపులర్ పాట "మై నా భూలూంగా" ను చక్రవర్తి యధాతథంగా తెలుగులోకి దించకుండా "మరువకుమా అనురాగం" అనే మెలోడీగా మలిచాడు.

చిరంజీవికి మాస్ ఇమేజ్ రావటంలో అతని ఫైట్స్, డ్యాన్స్‌లు ఎంత ప్రాధాన్యత వహించాయో, చక్రవర్తి మ్యూజిక్ కూడా అంతే ప్రముఖ పాత్ర వహించింది. అలాంటి మాస్ పాటల ప్రభంజనంలో వచ్చిన ఒక చక్కని మెలోడీ 'ఊరికి సోగ్గాడు' లోని శోభన్‌బాబు, విజయశాంతి మీద వచ్చే "పరవళ్ళు తీసింది గోదావరి" పాట.

అనుకున్నదే తడవుగా పైపాటల మీద నా అభిప్రాయాలను రాశాను. ఇందులో ఏమైనా తప్పులుంటే దయచేసి నాకు ఇ-మెయిల్ (schimata@gmail.com) ద్వారా తెలియచేయండి.

**Related Links:**

శోభన్‌బాబు, చక్రవర్తి కాంబినేషన్‌లో కొన్ని అత్యుత్తమ పాటలు:

http://www.chimatamusic.com/sobhan_chakra.php

శోభన్‌బాబు, చక్రవర్తి కాంబినేషన్‌లోని సినిమాలు:

http://www.chimatamusic.com/articles/Sobhan_Chakra_List.pdf

శోభన్‌బాబు ప్రొఫైల్:

http://www.telugucinema.com/c/publish/starsprofile/shobanbabuprofile.php

జైహింద్!!

శ్రీనివాసరావు చిమట

సిలికాన్‌వ్యాలీ (Fremont), CA